# బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యమెందుకు?

- జడ్చర్లలో విద్యార్థులు, ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో
- భారీగా నిలిచిన ట్రాఫిక్
- అరెస్ట్ చేసిన పోలీసులు

జడ్చర్ల, అక్టోబర్ 24 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు జడ్చర్లలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయని కారణంగా దాదాపు రూ.7,500 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పదినెలలు గడిచినా బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని, ఈ కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉన్నత చదువులకు ఆటంకం ఏర్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాస్తారోకోతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో పోలీసులు విద్యార్థులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



జడ్చర్ల పట్టణంలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు

- ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- నారాయణపేట కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల నిరసన

నారాయణపేట టౌన్, అక్టోబర్ 24 : ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. రూ.వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండడం వలన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థుల చదువులు, జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. పీజీ ఇతర కోర్సుల ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించినా, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో డబ్బులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకొనే ఆర్థిక స్థోమత లేక ఉన్నత విద్యలో అడ్మిషన్ పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ డీగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం బిల్డింగ్ రెంట్లు కట్టలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ కళాశాలలే మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అనంతరం వివిధ డిమాండ్లపై కలెక్టరేట్ ఏవో జయసుధకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి గౌస్, నాయకులు మహేశ్, సురేశ్, నవిత, అఖిల, శ్వేత, అశ్విని, సాగర్, రాజు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సాయికుమార్

# కూతురు బలవన్మరణం.. తండ్రి పోరాటం

- వరకట్న వేధింపులతో ఏడాది కిందట వివాహిత ఆత్మహత్య
- కట్నం, పొలం తిరిగి ఇచ్చేలా రాజీ..
- భర్త, అత్త, ఆడపడుచులకు శిక్ష పడాలని తండ్రి ఆవేదన
- న్యాయం చేయాలంటూ పలుచోట్ల ఫ్లెక్సీల ఏర్పాటు




కృష్ణ మండలం గుడెబల్లూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఊట్కూర్ (కృష్ణ), అక్టోబర్ 24 : కూతురు ఆత్మహత్య చేసుకోవడంతో తండ్రి మనోవేదనకు గురవుతున్నాడు. భర్త, అత్త, ఆడపడుచుల వరకట్న వేధింపులు భరించలేక తన కూతురు బలవన్మరణానికి పాల్పడిందని, వారికి శిక్ష పడాలంటూ.. అటు కర్ణాటక, ఇటు తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయిస్తున్నాడు.

బాధితుడి కథనం మేరకు.. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామానికి చెందిన చెన్నప్పగౌడ కర్ణాటకలోని శక్తినగర్ శిల్ప కంపెనీలో ఉద్యోగం చేస్తూ.. దేవసుగూర్‌లో ఉంటున్నాడు. ఒక్కగానొక్క కూతురు జయలక్ష్మిని ఐదేండ్ల కిందట కర్ణాటక రాష్ట్రం సేడం తాలూకా శంకర్‌పల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శంకర్‌రెడ్డితో వివాహం జరిపించారు. వారికి ఒక కూతురు ఉన్నది. కొన్నేండ్లపాటు కాపురం సజావుగా సాగగా.. అదనపు కట్నం తీసుకురావాలంటూ అత్తారింటి వేధింపులు మొదలయ్యాయి. 'మీ నాన్నకు నీవు తప్పా ఇంకెవరున్నారు.. ఆస్తి మొత్తం నీకే వస్తుంది కదా..' అంటూ చెప్పసాగారు. కూతురు కాపురాన్ని నిలబెట్టేందుకు చెన్నప్పగౌడ పలుమార్లు రూ.లక్షల్లో అత్తారింటికి ముట్టజెప్పాడు. అయినా భర్త, అత్త, ఆడపడుచుల వేధింపులు ఆగకపోవడంతో ఏడాది కిందట ఉగాది రోజున మనోవేదనకు గురైన జయలక్ష్మి ఆత్మహత్య చేసుకున్నది. కూతురు మరణానంతరం ఇరుకుటుంబాల బంధువులు, గ్రామస్తుల సమక్షంలో కట్నం కింద ఇచ్చిన రూ.10లక్షలు, 30తులాల బంగారం, పదెకరాల పొలాన్ని ఇచ్చేందుకు రాజీ కుదుర్చుకున్నారు. ప్రస్తుతం మనమరాలు తండ్రి వద్దే ఉంటున్నది. ఇదిలా ఉండగా, తనకు ఇస్తామన్న డబ్బు, బంగారం, పొలం గురించి అడిగితే రాజకీయ పలుకుబడితో తనపై బెదిరింపులకు పాల్పడుతున్నారని, గుల్బర్గా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితుడు విలపిస్తున్నాడు. మక్తల్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని చెబుతున్నాడు. ఆస్తికోసం మనమరాలిని కూడా చంపుతారనే భయం వెంటాడుతున్నదని, పోలీసులు పట్టించుకోకపోవడంతో తన కూతురు మృతికి కారణమైన భర్త, అత్త, ఇద్దరు ఆడపడుచులకు కఠిన శిక్ష పడాలని కోరుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నానన్నారు. ఇప్పటికే కర్ణాటకలోని గుల్బర్గా, దేవసుగూర్, సేడం, యాద్గిర్ పట్టణాల్లో ఫ్లెక్సీలను కట్టానని, తెలంగాణలో కృష్ణ మండలం గుడెబల్లూరుతోపాటు మరికొన్ని చోట్ల కూడా కడుతున్నట్లు చెప్పాడు. ఫ్లెక్సీల విషయంపై కృష్ణ పోలీసులను ప్రశ్నించగా.. తమ దృష్టికి రాలేదని చెప్పారు.

# రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- బీఆర్ఎస్ నేతల డిమాండ్
- చిన్నచింతకుంటలో నిరసన

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), అక్టోబర్ 24 : మండలంలోని ఫర్దీపూర్ గ్రామ రైతులు, బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో అక్రమ కేసులను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న రైతుభరోసాను వానకాలం పంటకు చెల్లించలేమని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటనను నిరసించిన పర్ధిపూర్‌కు చెందిన 25మంది రైతులు, బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం దారుణం అన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయాలని ప్రశ్నించిన రైతులపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే రైతులకు రైతుభరోసా చెల్లించడంతోపాటు రుణమాఫీ అమలు చేయాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి రైతులు భారీగా తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు.



చిన్నచింతకుంటలో రైతులకు మద్దతుగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# మున్సిపాలిటీలో సబ్‌లీజు దందాకు చెక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 24 : మున్సిపాలిటీలో సబ్ లీజు దందాకు పుర అధికారులు చెక్ పెట్టే చర్యలకు గురువారం శ్రీకారం చుట్టారు. నిరుద్యోగులు, నిరుపేదల జీవనోపాధి పెంపులో భాగంగా రిజర్వేషన్ కేటగిరీలో మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ దుకాణాలు పొంది తక్కువ అద్దెకు దుకాణాలు తీసుకొని అధిక అద్దెలకు వ్యాపారులకు ఇచ్చి ఏటా రూ.లక్షల ఆదాయం పొందుతున్నారంటూ ఆగస్టు 13న 'దుకాణం ఒకరిది.. వ్యాపారం మరొకరిది..' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ఇచ్చిన కథనానికి మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు సమగ్ర విచారణ అనంతరం ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో కొన్ని దుకాణాల అనుమతులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

***అద్దెలు చెల్లించని 6 దుకాణాలు సీజ్..***

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో నెలసరి అద్దెలు చెల్లించని దుకాణాలపై మున్సిపల్ రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. పట్టణంలోని గడియారం కూడలిలో రూ.40లక్షలకు పైగా అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉన్న ఆరు దుకాణాలు సీజ్ చేశారు. బకాయి ఉన్న దుకాణదారులు వెంటనే వాటిని క్లియర్ చేయించుకోవాలని లేదంటే 2, 3 రోజుల్లో మిగిలిన దుకాణాలు సైతం సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు.



దుకాణాలు సీజ్ చేస్తున్న రెవెన్యూ ఆఫీసర్, ఆర్ఐలు



అరకొర వసతులతోనే వనపర్తిలో కొనసాగుతున్న ఇంజినీరింగ్ కళాశాల

# ఇరకాటంలో ఇంజినీరింగ్ విద్య

- సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం
- సవ్యంగా సాగని బోధన
- హాస్టల్‌లో కనీస సౌకర్యాలు కరువు
- రోడ్డెక్కిన విద్యార్థులు


వనపర్తి, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : వనపర్తిలో కొనసాగుతున్న జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కొంత సాఫీగా సాగిన కళాశాల ప్రస్తుతం సమస్యలకు నిలయంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రిగా కొనసాగిన సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వనపర్తికి జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయించారు. 45 ఎకరాల భూమిని కళాశాలకు కేటాయించారు. రూ.4.70కోట్లను కొన్ని నిర్మాణాల కోసం మంజూరు చేయించారు. అయినా నిర్మాణాల వైపు కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం కన్నెత్తి చూడటం లేదు. 2022లో గోపాల్‌పేట రోడ్డులోని పీజీ కళాశాలలో బీఆర్ఎస్ ప్రభుత్వం తాత్కాలికంగా కళాశాలను ఏర్పాటు చేసింది. ఐదు కోర్సులతో 275 మందితో మొదటి సంవత్సరం కొనసాగింది. అలాగే రెండో సంవత్సరం 269 మందితో, ప్రస్తుతం మూడో సంవత్సరంలో 290 మందితో కళాశాల కొనసాగుతున్నది. ఒకటి, రెండు సంవత్సరాల్లో కొంత సాఫీగానే నడిచింది. మూడో ఏడాదిలోకి రాగానే సమస్యల సుడిగుండంలోకి వెళ్లినట్లయ్యింది. ప్రతి యేటా విద్యార్థుల సంఖ్య పెరగడం, గదులు సరిపోకపోవడంతో కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

***రెండు చోట్ల బోధనలు, మూడు చోట్ల హాస్టళ్లు..***

ఇంజినీరింగ్ విద్యలో ప్రస్తుతం రెండు చోట్ల బోధనలు, మరో మూడు చోట్ల విద్యార్థులకు హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. గోపాల్‌పేట రోడ్డులో ఉన్న పీజీ కళాశాలలో మొదట 7గదులతో ప్రారంభించారు. మొదట్లోనే అక్కడికి సమీపంలో ఉన్న ఎస్‌డీడీపీఏ స్వచ్ఛంద సంస్థకు చెందిన భవణంలో బాలికలకు హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. క్రమంగా విద్యార్థినులు పెరగడంతో మరోచోటుకు తరలించి కేవలం బోధనలకు వినియోగిస్తున్నారు. ఈ స్వచ్ఛంద సంస్థ భవణంలోనూ వసతులు అంతంత మాత్రమే ఉన్నాయి. ఒకే దగ్గర బాత్రూంలు, తరగతి గదులు అన్నట్లుగా ఉండటంతో వాష్ రూమ్స్ దుర్గందంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పీజీ భవనంతోపాటు స్వచ్ఛంద సంస్థ భవనంలో బోధనలు చేస్తున్నారు. ఇక విద్యార్థులకు హాస్టళ్ల కోసం మరో మూడు భవనాలను పట్టణంలో వివిధ చోట్ల అద్దెకు తీసుకున్నారు. ఇలా బోధనలు రెండు చోట్ల, హాస్టళ్లు మూడు చోట్ల కావడంతో విద్యార్థులు కళాశాలకు రావాలన్నా, పోవాలన్నా నరకయాతన అనుభవిస్తున్నారు.

***రూ.4.70కోట్లు మంజూరైనా..***

కేసీఆర్ ప్రభుత్వంలో ఇంజినీరింగ్ కళాశాలకు 45 ఎకరాల భూమిని కేటాయించడంతోపాటు రూ.4కోట్ల 70లక్షలను మంజూరు చేశారు. వీటి ద్వారా రెండు అకాడమీ బ్లాకులు, మరొక వర్క్ షాప్, రెండు బోరుబావులు, ప్రహరీ కోసం ఈ నిధులు మంజూరు చేయగా, ఆర్ ఆర్ అసోసియేట్ కంపెనీ పనులను తీసుకున్నది. కొన్ని పనులను మాత్రమే మొదలు పెట్టి వదిలేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఇంజినీరింగ్ కళాశాల పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దాదాపు పదినెలల కాలంలో ఇంజినీరింగ్ కళాశాల సమస్యలపై కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని విద్యార్థులు వాపోతున్నారు.




### ఎవరూ పట్టించుకోవడం లేదు..



కళాశాలలో సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదు. తరగతి గదులు సరిపడా లేవు. హాస్టల్ నుంచి కళాశాలకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది. మొదటి సంవత్సరం తక్కువ మందిమి కావడంతో ఎలాగోలా నడిచింది. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదు.

– సుస్మిత, ద్వితీయ సంవత్సరం, ఈసీఈ

### కనీస వసతులు లేవు..



ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటైనా వసతులను సమకూర్చలేదు. సమస్యలతో విద్యార్థులంతా రోడ్డుపైకి రావాల్సి వచ్చింది. కనీస వసతులైన వాష్‌రూమ్స్, నీళ్లు కూడా లేవు. ఇలాగుంటే చదువులెలా చదవాలి. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

–కోమలి, ద్వితీయ సంవత్సరం, సీఈసీ

### అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



కళాశాలలో నెలకొన్న సమస్యలను జేఎన్‌టీయూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అలాగే కలెక్టర్, ప్రజాప్రతినిధులకు వివరించాం. ఒకే దగ్గర పెద్ద భవనం లేకపోవడం వల్ల సమస్యలు వస్తున్నాయి. తాత్కాలికంగా పట్టణంలో మరో భవనం అద్దెకు తీసుకొని బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేశాం. మా పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– రాం నరేశ్ యాదవ్, వైస్ ప్రిన్సిపాల్, ఇంజినీరింగ్ కళాశాల, వనపర్తి

### ఎమ్మెల్యేకు చెప్పినా బస్సులకు బ్రేక్..

దాదాపు 800 మందికి పైగా కొనసాగుతున్న ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు సమస్యలతో సతమతమవుతున్నారు. పట్టణంలో హాస్టళ్లు ఉండగా, మూడు కిలోమీటర్ల దూరంలో కళాశాల ఉన్నది. రవాణా సమస్యను గతంలో ఎమ్మెల్యే మేఘారెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా, అదనపు బస్సులు నడిపి కొన్నాళ్లకే నిలిపివేశారు.

# సీతమ్మతండాలో తాగునీటి గోస

నవాబ్‌పేట, అక్టోబర్ 24 : నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని సీతమ్మతండా ప్రజలు గత ఏడాది కాలం నుంచి తాగునీటి కోసం అరిగోస పడుతున్నారు. ఏడాది నుంచి సీతమ్మతండాకు మిషన్‌భగీరథ నీరు సరఫరా కాకపోయినా అధికారులు పట్టించుకోడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షమీయుల్లాను వివరణ కోరగా తండాలో పైప్‌లైన్ ద్వారా నీరు ట్యాంక్‌కు ఎక్కకపోవడం కారణంగానే నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. త్వరలోనే తండాలో నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సీతమ్మ తండాలో తాగునీటి కోసం తంటాలు పడుతున్న గిరిజనులు

# హామీలిచ్చేప్పుడు ఆర్థిక వనరులు గుర్తురాలేదా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

- బీఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

పెద్దమందడి, అక్టోబర్ 24 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఆ హామీలు అమలు చేయమంటే రాష్ట్ర ఆర్థిక వనరులు సరిగా లేవనడం సరికాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అన్నారు. మరి హామీలు ఇచ్చే ముందు రాష్ట్ర ఆర్థిక వనరులు గుర్తుకు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వేణుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరా రైతులకు ఇవ్వాల్సిన రైతుభరోసాను ఎగవేసిందని, రుణమాఫీని అరకొరగా చేసి రైతులను మోసం చేసిందని ఆరోపించారు. గత పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు రాజులా ఉంటే నేడు 10 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. కేసీఆర్ రైతుల కోసం రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంట్, సాగునీరు, రైతుబీమా లాంటి అనేక పథకాలు తీసుకువస్తే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వానకాలం పంటకు రైతుభరోసా ఇవ్వలేమని చావుకబురు చల్లాగా చెప్పాడన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రైతులకు రూ.2లక్షలలోపు రుణమాఫీ ఆగస్టు 15వ వరకు చేస్తామని దేవుండ్ల మీద ఒట్టుపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి నిలువునా మోసం చేశారన్నారు. రైతులను నిలువు దోపిడీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో ఈనెల 29న నిర్వహించనున్న రైతుల సమరభేరీ కార్యక్రమానికి రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్ డైరెక్టర్ విజయ్, జాత్రునాయక్, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మండ లాధ్యక్షుడు వేణుయాదవ్, నాయకులు నాగేంద్రంయాదవ్, కుమార్‌యాదవ్, సేనాపతి, సురేశ్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కురుమూర్తి, రాములు, నాగభూషణ్ తదితరులు ఉన్నారు.

# రెండు కొత్త గ్రామ పంచాయతీలు

గోపాల్‌పేట, అక్టోబర్ 24 : మండలంలో మరో రెండు కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. ఆముదాలకుంటతండా పరిధిలోని జింకల బీడుతండా, కర్ణమయ్యకుంటతండా పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామాలను కొత్త గ్రామ పంచాయతీలుగా ప్రకటించారు. ఇందుకు సంబంధించి గురువారం కలెక్టర్ కార్యాలయం నుంచి జీవో రాగా వాటి ప్రొసీడింగ్ కాపీలను ఎంపీడీవో శంకర్‌నాయక్ గ్రామస్తులకు అందజేశారు. తమ గ్రామాలను పంచాయతీలుగా ప్రకటించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# జాతీయ రహదారిపై మద్యం లారీ బోల్తా

జడ్చర్ల, అక్టోబర్ 24 : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి మద్యంలారీ బోల్తాపడింది. బుధవారం రాత్రి పెబ్బేర్ వద్ద గల రంగాపూర్ మద్యం డిపో నుంచి 1450 ఓసీ 180ఎంఎల్ మద్యం కాటన్ల లోడుతో హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్‌లారీని జడ్చర్ల ఫ్లైవర్ చివరలో నిలిపాడు. అదేసమయంలో కర్నూల్ నుంచి వేగంగా వచ్చిన మరోలారీ మద్యం లోడుతో ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ లారీ ముందుకు వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో కంటైనర్‌లారీలో ఉన్న మద్యం బాటిళ్లు చల్లాచదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదంలో మద్యంలారీ డ్రైవర్ తలకు గాయాలు కాగా వెనుక నుంచి ఢీకొట్టిన లారీ డ్రైవర్‌కు కాలువిరిగినట్లు పోలీసులు తెలిపారు. అయితే మద్యంలారీ బోల్తాపడడంతో అందులో మద్యం బాటిళ్లను తీసుకెళ్లడానికి జనం ఎగబడ్డారు. ఈ విషయం తెలుసుకున్న జడ్చర్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్న వారిని అక్కడి నుంచి పంపించారు. లారీ బోల్తాపడడంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసులు లారీని క్రేన్ సహాయంతో అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

# వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలి

- పోలీసులకు వారాంతపు సెలవులు ఇవ్వాలి
- జాతీయ రహదారిపై పోలీసు కుటుంబ సభ్యుల ధర్నా

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 24 : పోలీసులను వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం పోలీస్ సిబ్బందికి చెందిన కుటుంబ సభ్యులు చిన్నపిల్లలతో కలిసి జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్ల లీవ్ మాన్యువల్ ప్రకారం తమ భర్తలు నెలకు ఒకసారి ఇంటికి వస్తారని, ఇప్పటి వరకు 15రోజులకు ఒకసారి వచ్చేవారని, ఇదే కష్టంగా ఉందనుకుంటే మళ్లీ పాతపద్ధతి అమల్లోకి వస్తున్నదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారాలకు వారాలు తమ భర్తలు డ్యూటీ పరంగా కుటుంబానికి దూరం కావడంతో కుటుంబంలో చిన్నపిల్లలతోపాటు తమకు అత్యవసర పరిస్థితులు వచ్చినా అందుబాటులో ఉండని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ డ్యూటీల కారణంగా కుటుంబ కలహాలు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీజీఎస్పీ బెటాలియన్స్‌లో జరుగుతున్న వెట్టి చాకిరిని నిర్మూలించాలని మొత్తంగా ఒకే రాష్ట్రం– ఒకే పోలీస్ అనే వ్యవస్థను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పదోపటాలంలో గద్వాల డీఎస్పీ సత్యనారాయణ, పదో పటాలం కమాండెంట్ సాంబయ్య పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యుల వద్దకు వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అయితే పోలీసు సిబ్బంది ధర్నా కారణంగా జాతీయ రహదారిపై మూడు కిలో మీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి ఇటిక్యాల, కోదండాపూర్ స్టేషన్‌కు చెందిన పోలీస్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న పదోపటాలం సిబ్బంది కుటుంబ సభ్యులు